# ఆకాశానికి మెట్లు

డియర్ ఫ్రెండ్ నిరంజన్-

నీకో గుడ్‌న్యూస్. ఇన్నేళ్ళ తర్వాత నీకో శుభవార్త ను రాయ గలుగుతున్నాను. ఈ విషయం నీకు ఎంతో సంతోషాన్ని, ఆనందాన్ని కలిగిస్తుందని నాకు తెలుసు. ఇన్ని రోజుల నా కలలు ఇప్పటికి నిజ మైనాయి. ఎంతో కష్టపడి, ఎన్నో ప్రయాసలను ఎదుర్కొని చదివిన చదువుకు- సంపాదించిన విజ్ఞానానికి ఈరోజు ఓ సార్ధకత యేర్పడింది. ఇంతకీ అసలు సంగతి రాయకుండా నిన్ను సస్పెన్స్‌లో వుంచు తున్నాను కదా ;

సరే- అసలువార్త రాస్తాను. అదే ఉద్యోగం పురుష లక్షణం కదా ! ఇప్పటికి నేనూ ఓ ఉద్యోగ పురుషుడి నయ్యాను నాకు వుద్యోగం వచ్చింది. మామూలు ఉద్యోగం కాదు. ఓ పెద్ద కంపెనీలో ఓపెద్ద ఉద్యోగం వచ్చింది. నాజీతం మూడువేలు. ఇల్లు- స్కూటరు- టెలిఫోన్ లాంటి అన్ని సౌకర్యాలూ నాకు లభిస్తున్నాయి. ఇంతటి ఉన్నతమైన స్థితిని నేను ఏరోజునైనా వూహించ గలిగానా ?

నీకు అసూయగా వున్నదికదా! అవును. తప్పకుండా వుంటుంది. ఎందుకంటే నువ్వు ఒక సాధారణమైన వుద్యోగాన్ని డబ్బుతో సంపా దించుకున్నావు. కాని నేను ఎప్పటికైనా నా చదువు- తెలివితేటలతోనే మంచి వుద్యోగాన్ని సంపాదించుకుంటానని నీతో చెప్పాను గుర్తుందా ? ఇప్పటికి నేను నామాట నిలబెట్టుకోగలిగాను. నాకు గాల్లో తేలిపోతు న్నట్టుగా వుంది. నాకు మంచి స్నేహితుడివైన నీకూడా ఈ వార్త

గొప్ప అనందాన్ని కలిగించగలదనే నీకు ఈ వుత్తరం రాస్తున్నాను. ఇక వుంటాను. తిరుగు జవాబు రాస్తావు కదా !- నీమిత్రుడు-ప్రకాశం.

ఆ ఉత్తరాన్ని కవర్లోపెట్టి అంటించిన తర్వాత అతను వూరుకో లేదు. మళ్ళీ ఓ తెల్లకాయితం తీసుకుని మరో మనిషికి వుత్తరం రాయటం మొదలుపెట్టాడు.

శ్రీమతి సుజాతా-

నిన్నిలా- శ్రీమతి- అంటూ సంబోధించటం నాకు గొప్ప ఆశ్చర్యంగా వుంది. అవును- నీకు ఒకప్పటిలా డియర్ సుజాతా- అని వుత్తరాలు రాయకూడదు కదా! ఇప్పుడు నువ్వు మరోమనిషి అర్ధాంగివి. సరే....గతాన్ని తవ్విపోయటానికి నేను నీకీ వుత్తరం రాయటం లేదు. నువ్వు అమితంగా ఆశ్చర్యపడే ఓ విషయాన్ని ఇందులో రాస్తున్నాను.

నాకు వుద్యోగం వచ్చింది. మూడువేల జీతం- ఇల్లు-స్కూటరు- టెలిఫోన్ అన్నీ మా కంపెనీవాళ్ళే ఇస్తున్నారు. ఇన్నాళ్ళకు నాచదువుకు, తెలివితేటలకు గుర్తింపు కలిగింది.

అసలు నువ్వు నా చురుకుదనం- చదువు- తెలివిని చూసేకదూ నాతో ప్రేమలో పడ్డావు. కాని- నీఅంచనా తలక్రిందులయింది. నువ్వు వూహించినట్టుగా నా తెలివితేటలు చదువు పూర్తయిన వెంటనే ఓ ఉద్యోగాన్ని సంపాదించి పెట్టలేదు. ఇక నాకు వుద్యోగం రాదనుకుని మన ప్రేమ కథను గాలికి వదిలి ఓ ఉద్యోగిని పెళ్ళిచేసుకుని వెళ్ళి పోయావు కదా ! ఇప్పుడేమయ్యింది? నీ భర్తకంటే ఎంతో ఎత్తుకు ఎదిగిపోయాను. ఇప్పుడు నీకు ఈ ఉత్తరాన్ని రాయడం నాకెంతో గర్వాన్ని కలిగిస్తోంది- మరి వుండనా- బై - ప్రకాశం.

8)

అతను ఆ వుత్తరాన్ని కూడా కవర్లోవుంచి అంటించి ఎడ్రసు రాశాడు.

ఒక్కసారి ఆ రెండు కవర్లమీద వున్న ఎడ్రసులను చూశాడు. చాలా సేపటి వరకూ వాటినే చూస్తూ ఏదో ఆలోచిస్తూ వుండిపోయాడు. తర్వాత అతనికి మరికొంత మంది మిత్రులు గుర్తుకు వచ్చారు. వాళ్ళం దరితోపాటు ప్రకాశానికి లెక్చరర్ రంగారావు కూడా గుర్తుకువచ్చాడు. అప్పుడు అతను అయనక్కూడా తనకు గొప్ప వుద్యోగం వచ్చినట్టు ఓ ఉత్తరం రాశాడు. ఎందుకంటే ఆయన ప్రకాశాన్ని ఎప్పుడూ "నువ్వు గొప్ప పొజిషన్‌కు వెళ్ళిపోతావు" అనేవాడు.

ఆరోజునే ఆ వుత్తరాలను మరికొంత మంది మిత్రులకు రాసిన వుత్తరాలతో పాటు పోస్టు చేశాడు.

సరిగ్గా ఆరు రోజుల తర్వాత-

ఓరోజు ప్రకాశానికి మూడుకంటే ఎక్కువ వుత్తరాలు వచ్చాయి. అతను మొదటగా ఓ ఉత్తరం మడత విప్పాడు.

అందులో ఇలా వుంది.

డియర్ ప్రకాశం-

నీవుత్తరం నాకెంతో సంతోషాన్ని కలిగించింది. ఇప్పుడు నిజంగా నాకెంతో బాధగా వుంది. నేను రియల్‌గానే నిన్ను ప్రేమిం చాను. నువ్వే కావాలని కోరుకున్నాను. కాని- నువ్వు పేదవాడివనీ నీకు వుద్యోగం లేదనీ, నిన్ను నమ్ముకుంటే జీవితాంతం కష్టాలనే ఎదుర్కోవలసి వస్తుందనీ మాఇంట్లో నన్ను ఎంతగానో భయపెట్టారు. అందుకే నేను మరో మనిషిని పెళ్ళి చేసుకోటానికి అంగీకరించాను. ఏమైనా నేను గొప్ప పొరపాటు చేశాను ప్రకాశం. ఇప్పుడు చింతించి ప్రయోజనం యేమిటి? పోన్లే- నువ్వయినా ఈరోజు గొప్ప స్థితిలోకి

వెళ్ళగలిగావు. నాకు అదే తృప్తి. నీ చదువు- తెలివితేటలు వృధా కాలేదు. నీకు నా అభినందనలు. ఇక ముగిస్తాను.

ఆ ఉత్తరాన్ని సుజాత రాసింది.

అతని పెదవుల మీద చిరునవ్వు నాట్యం చేస్తుండగా అతను మరో ఉత్తరాన్ని విప్పాడు. అందులో-

మైడియర్ ఫ్రెండ్ ప్రకాశం-

కంగ్రాచ్యులేషన్స్. నిజంగానే నాకు అసూయగా వుంది. ఇప్పటికి నీ ఆశయం నెరవేరింది. నువ్వు పడిన కష్టానికి ప్రతిఫలం దక్కింది. నీకు పెద్ద వుద్యోగం వచ్చిందనే వార్త నిజంగా నాకు గొప్ప ఆనందాన్ని కలిగించింది. ఈ న్యూస్‌ని ఇక్కడ ముఖ్యమైన స్నేహితులందరికీ చెప్పాను. వాళ్ళంతా నీకు తమ అభినందనలు తెలియజేయమని చెప్పారు. తరచు వుత్తరాలు రాస్తూండు. నీ స్నేహితుడు- నిరంజన్.

మూడో వుత్తరాన్ని లెక్చరర్ రంగారావు రాశాడు.

ప్రియమైన ప్రకాశం- నీ వుత్తరం నాకు బాగా సంతోషాన్ని కలిగించింది. అయితే నామాట ఇప్పటికి నిజమైందన్న మాట. చదువులో నీ చురుకుదనం చూసి నువ్వు భవిష్యత్తులో ఇలాంటి పెద్ద ఉద్యోగస్తుడివి అవుతావని అప్పుడే వూహించగలిగాను. నీకు ఇంకా మంచి భవిష్యత్తు వుంది. జీవితంలొ నువ్వింకా వున్నత శిఖరాలను చేరుకోవాలని కోరుకునే- మీ రంగారావు

తర్వాత- మిగిలిన మిత్రుల దగ్గర్నుంచి వచ్చిన వుత్తరాలను కూడా చదివాడు ప్రకాశం. వాళ్ళు కూడా అతనికి అంత పెద్ద ఉద్యోగం వచ్చినందుకు సంతోషాన్ని, అసూయను వ్యక్తంచేస్తూ రాశారు.

ఆ వుత్తరాలన్నింటినీ చదివిన ప్రకాశం చీకటి గుహలావున్న

ఆ చిన్న గది మధ్య నిలబడి "ఫూల్స్....ఇడియట్స్....అంతా వట్టి వెధవలు...." అని పెద్దగా నవ్వాడు.

యూనివర్సిటీ గోల్డ్ మెడల్ సంపాదించిన పోస్ట్‌గ్రాడ్యుయేట్‌కి- దబ్బుతో వుద్యోగం కొనలేని ఓ పేదవాడికి- ఎలాంటి సిపార్సులూ లేనివాడికి- ఈ దేశంలో నెలకు మూడువేల జీతంతో ఇల్లు-స్కూటరు-టెలిఫోన్ సౌకర్యాలు వున్న వుద్యోగం వచ్చిందని రాస్తే కనీసం ఒక్కడికూడా ఇది అసంభవం- అనే ఆలోచన రాలేదంటే అంతా వెధవలే అని పడిపడి నవ్వుకున్నాడు ప్రకాశం.

తర్వాత కొన్ని నిముషాలకు- ఆ గదిలో ఓ మూలగా వున్న వాల్‌పోస్టర్లను, గమ్ బకెట్‌ను తీసుకుని గదికి తాళంపెట్టి బయల్దేరాడు. గోడలకు పోస్టర్లను అంటించటమే ఆ గోల్డ్‌మెడలిస్టు ప్రస్తుత ఉద్యోగం.

(1984 సెప్టెంబర్ – యువ) * *